
# మిలట్రీ నరసింహులు

- బుద్ధి యజ్ఞమూర్తి



చూరు తగలకుండా కిందికి వొంగి గుడిసె లోంచి బయటకు వొచ్చారు నున్నా నరసింహులు. తలకి రెండురెట్లు పెద్దదిగా ఉన్న పెద్ద తలపాగా, వెండి దారప్పోగుల్లా మెరుస్తున్న తెల్లటి బుర్రమీసాలు, ఆ మీసాల కింద గుప్పున పొగ వొదులుతూ పొడవాటి చుట్ట, వొంటిమీద మరకలతో దుమ్ముకొట్టుకుని ఖాకీ చొక్కా, ఆ చొక్కా కింద మురికిమురిగ్గా పాతబడిపోయిన తెల్ల పంచె, కుడి భుజాన అతుకులు వేసిన పురాతన కాలంనాటి నూలు సంచి, ఎడమ చేతిలో కర్ర.. ఇదీ నరసింహులు వేషం.

“వొచ్చేప్పుడు మర్చిపోకుండా బిళ్లలు తేయ్యా”అని లోపల్నించి బలహీనమైన గొంతు వినిపించింది. అది అతడి భార్య యానాదమ్మది. ఆయాసం, దగ్గుతో బాధ పడుతూ తెగిపోతున్న నులక మంచం మీద పడుకొని ఉంది. ఆమె నడవలేదు కూడా.

“తెత్తాలెయ్యే”అంటా బాటమీదికొచ్చాడు నరసింహులు. ఆ బాట అవతల నేల కనిపించడం లేదు. ఎటుచూసినా విరగ్గాసిన మొక్కజొన్న కంకులే. అప్పుడే ఒక ఎడ్లబండి ఆ చేల మధ్య లోనుంచి బాటమీదికొచ్చింది. ఆ బండి నిండా కంకులు, బండెనక నలుగురు పిల్లకాయలు కూర్చుని చేతుల్లో ఉన్న మొక్కజొన్న కంకుల మీద మట్టల్ని వొలుస్తూ కబుర్లాడతా ఉన్నారు. మధ్యమధ్యలో పెద్దపెద్దగా నవ్వుతున్నారు.

ఎడ్లబండి నరసింహులును దాటింది. అతన్ని చూడంగాల్నే “ఏయ్ మీసాలతాతా. నీ టోపీ ఇస్తావా. ఇదిస్తా”అని ఒక పిల్లవాడు ఎకసెక్కం చేశాడు. చేతిలోని కంకిని ఊపుతా. మిగతా పిల్లకాయలు బిగ్గరగా నవ్వారు.

నరసింహులు చేయి టక్కున తలపాగా మీదికెళ్లింది. గట్టిగా దాన్ని అదిమి పట్టుకున్నాడు.

“పోండిరా భడవల్లారా. ఈ ముసలోణ్ణి చూత్తంటే ఎగతాళిగా ఉంటంది మీకు. మిలట్రీలో పని చేసినోణ్ణిరా. నాతో పెట్టుకోకండ్రోయ్” అన్నాడు కర్రని వాళ్లకేసి ఊపుతా.

“అబ్బో మిలట్రీ తాత మనల్ని కొట్టేట్టున్నాడోయ్. పారిపోదాం పదండి”అని ఇంకో పిల్లవాడు అనేసరికి, మిగతావాళ్లు మళ్లా పెద్దగా నవ్వారు.

“రేయ్ ఆపండ్రా పరాచికాలు. ఆ ముసలోడితో మీకెందుకు?” అని కసురుకున్నాడు బండి తోలుతున్న తను. దాంతో పిల్లకాయల నోళ్లు మూతపడ్డాయి.

ఎద్దుల గిట్టల బలానికి లేచిన దుమ్ము ఎడమ కంట్లో పడింది. కన్ను నులుముకున్నాడు నున్నా నరసింహులు. అతడి కుడి కన్ను దాదాపుగా పాడైపోయింది. ఎప్పుడూ పుసులు కారుతూ ఉంటుంది. ఆ కంట్లో ఏం పడినా అతడికి తెలీదు.

నడుస్తున్నాడు నరసింహులు. పందిళ్లపల్లిలో ఊరి చివర గుడిసెలో ఇరవై ఏళ్లుగా ఉంటున్నాడు. అయినా అయినవాళ్లెవరూ అతని దగ్గర లేరు. ఒక్క రాజేంద్ర మాత్రమే నరసింహులుతో దయగా మాట్లాడుతుంటాడు. అతను రైసుమిల్లు ఓనరు పట్టాభి కొడుకు. సాయంత్రంపూట నరసింహులు గుడిసె మీదుగా తమ పొలానికి వెళ్తుంటాడు రాజేంద్ర. ఆ రోజు నరసింహులుకి అతను కనిపించలేదు.

ఊళ్లోకి వొచ్చాడు నరసింహులు. కాస్త దర్జాగా కనిపించినోళ్లనల్లా “ఒక్క పావలా ధర్మం చెయ్యండి బాబయ్యా”అని అడుక్కోవడం మొదలుపెట్టాడు భుజానికి తగిలించుకున్న సంచిని తెరచిపెట్టి. కొంతమంది పావలో, అర్థరూపాయో వేస్తుంటే, కొంతమంది చీదరించుకుని అవతలకి పోతున్నారు. ఇంకొంత మంది “చిల్లర లేదు పో...పో...”అని చీత్కరిస్తున్నారు. అప్పుడు నరసింహులు పెద్ద గొంతుతో ఎవరినో ఉద్దేశించి తిడుతూ “బాంచెత్. మీవొల్లనే కదంట్రా నాకిట్టాంటి గతి పట్టింది. మీరు పురుగులుపట్టి పోతార్రా దొంగనాయాళ్లారా..” అంటూ ఏడ్పు మొదలుపెట్టాడు.

“నాకేం తెల్వదు.. నాకేం పాపం తెలీదు. అయినా గానీ నామీద నింద మోపారు కదర్రా”అన్నాడు ఏడుస్తూనే. కొత్తవాళ్లు నరసింహులు మాటలు విని, అవి అర్థమయ్యీ అవక, అతను తమని ఉద్దేశించి ఆ మాటలంటున్నాడా అని సందేహపడుతున్నారు. నరసింహులు గురించి ఏ కాస్తో తెలిసినోళ్లు “ఆ ముసలాడంతే. అడుక్కుంటూ ఎవర్నో తిడుతుంటాడు. ఒకప్పుడు మిలట్రీలో పనిచేశాడంట. పాపం ఇప్పుడు అడుక్కుంటున్నాడు గతిలేక” అని పక్కవాళ్లకి చెబుతున్నారు.

* * *

నున్నా నరసింహులు ఒకప్పుడు ఓ మోస్తరుగానే బతికాడు. మద్రాసు ఇంజనీరింగు గ్రూపుకింద ఆర్మీలో పనిచేశాడు. 1952లో సైన్యంలో డ్రైవరుగా చేరిన అతను బర్మా, ఇటలీ, నేపాల్, ఇరాన్ వంటి దేశాలు తిరిగాడు, ఉద్యోగంలో భాగంగా. పదిహేడు సంవత్సరాల క్రితం 1969లో రిటైరయ్యాడు. అతని కుడికన్ను దెబ్బ తినడమే అందుకు కారణం. ఆ తర్వాత జీవన భృతి కోసం అతను డ్రైవరుగా, వాచ్‌మన్‌గా ఉద్యోగాలు చేశాడు.

ఆర్మీనుంచి వొచ్చాక నెలకు 350 రూపాయలు పెన్షను కింద వొచ్చేవి. దీంతో నరసింహులు జీవితం సాఫీగానే నడిచేది. ఇద్దరు కూతుళ్లకు పెళ్లిళ్లుచేసి అత్తారింటికి పంపేశాడు. ఇక ఇంట్లో ఉండేది అతనూ, భార్య యానాదమ్మే.

బుర్రమీసాలు, దెబ్బతిన్న కంటితో నరసింహులు చూడ్డానికి కాస్త భీకరంగా అవుపించినా, మనిషి వెన్న లాంటివాడు.

సైన్యంలో పనిచేసినా అతని మాటల్లో, చేతల్లో కరకుదనం కనిపించదు. అందుకే చిన్నపిల్లలకి అతడు ‘మీసాల తాతయ్య’ అయిపోయాడు. మంచి మంచి కథలు చెబుతుంటాడు కాబట్టి ‘కథల తాతయ్య’గా కూడా చేరువయ్యాడు. అదే అతనికి తర్వాత కాలంలో చేటు తీసుకొచ్చింది.

* * *

పర్చూరులో ఒక పెద్ద ఆసామి ఇంట్లో డ్రైవరుగా పనిచేస్తున్నాడు అప్పట్లో. ఆ ఇంట్లో చాలామంది మనుషులు. వాళ్లకి చాలామంది పిల్లలు. వీలు దొరికినప్పుడల్లా ఆ పిల్లలకి కథలు చెబుతున్నాడు నరసింహులు. వాటిలో పౌరాణికాలు, జానపదాలు ఎక్కువ. మళ్లీ వాటిలో వీరరసం ఎక్కువ. సహజంగానే ఆ కథలు పిల్లల్ని బాగా ఆకట్టుకునేవి. అలరించేవి. కథ చెప్పేప్పుడు ఎవరన్నా నరసింహులుని పిలిచి, పనిచెబితే ఆ పిల్లలు తెగ బాధపడేవాళ్లు.

‘తాతయ్య కథ చెబుతున్నాడు. కాసేపు ఆగమ'ని

పెద్దల్ని బతిమిలాడేవాళ్లు. దాంతో "ఇదిగో నరసింహులూ, ఈ కథలూ, కాకరకాయలూ అంటా పిల్లల్ని చెడగొట్టమాకా" అని విసుక్కునేవాళ్లు పెద్దలు. నరసింహులు నవ్వి ఊరుకునేవోడు. "మళ్లీ వొచ్చాక చెబుతాలే"అని పిల్లల్ని ఊరడించి, కారు తియ్యడానికి వెళ్లేవోడు. అట్టా అతడి కథలకి ఎడిక్ట్ అయిపోయారు పిల్లలు. సెలవు వొచ్చిందంటే కథల తాతయ్యకోసం వెతుక్కునేవోళ్లు. కథ చెప్పడంలో అంత మహత్తుంది నరసింహుల్లో. పిల్లలే కాదు, అతడు కథ చెబుతుంటే విన్నారా పెద్దలు, వాళ్లు కూడా కథ అయిపోయేదాకా అట్టా వింటూ వుండి పోవాల్సిందే.

అప్పుడు జరిగింది ఆ విషాదకర సంఘటన. ఆరోజు సెలవుకావడంతో తమ మామిడి తోటల్ని చూడాలని పిల్లలు గొడవ గొడవ చేశారు. దాంతో ఆ పిల్లల్ని తీసుకెళ్లే బాధ్యత నరసింహులు మీద పడింది. మధ్యలో ఆకలైతే తినడంకోసం మినమ్ముద్దలు, కజ్జికాయలు ఒక టిఫినులో పెట్టిచ్చారు ఆ ఇంటి ఆడోళ్లు. ఎనిమిది మంది పిల్లల్ని తీసుకుని రెండు మైళ్లదూరంలో జాగర్లమూడి దగ్గరున్న మామిడి తోటకి వెళ్లాడు నరసింహులు.

పదెకరాల తోట. అక్కడక్కడా జీడిమామిడి చెట్లు కూడా ఉన్నాయి లోపల. వాటి కొమ్మలు నేలకి సమాంతరంగా, దగ్గరగా ఉండటంతో పిల్లలు వాటి కొమ్మల మీద ఆడుకుంటున్నారు చిలకల్లా. సీతాకోక చిలకల్లా. ఫిబ్రవరి తొలి రోజులు కావటాన మామిడిచెట్లు అప్పుడే పచ్చటి పూతతో నిగనిగలాడుతున్నాయి. అక్కడక్కడా పిందెలు వేస్తున్నాయి. ఆ పిందెల్ని కోయకుండా ఆడుకోమన్నాడు తోటమాలి.

పిల్లలు కోతికొమ్మచ్చి ఆడుతుంటే తనూ పిల్లాడిలా మారిపోయి వాళ్లతో ఆడాడు నరసింహులు. పిల్లలు మామిడి పిందెలు కోయబోతుంటే తోటమాలి రాక్షసుడనీ, చూశాడంటే మింగేస్తాడనీ భయపెట్టాడు.

పిల్లలు కథ చెప్పమని మారాం చేశారు. విశాలమైన ఒక పెద్ద మామిడి చెట్టు కింద నేల శుభ్రంచేసి, పిల్లలకి 'పాతాళ భైరవి' కథ చెప్పాడు నరసింహులు. కజ్జికాయలు, మినమ్ముద్దలు తింటా ఆ కథలో నాయకుడైన తోటరాముడు చేసే సాహసాల్నీ, నేపాళ మాంత్రికుణ్ణి అతడు ఎదుర్కొనే వైనాన్నీ ఆశ్చర్యపోతూ విన్నారు పిల్లలు. కథవిని, కాస్సేపు తాము స్కూల్లోచేసిన సాహసాల్ని పిల్లలు కబుర్లుగా చెప్పుతుంటే నరసింహులు నవ్వుతా విన్నాడు.

ఆ తర్వాత 'డిప్పాట' ఆడతామని పిల్లలు గోలపెట్టారు. అప్పటికే సూర్యుడు కిందికి పోతున్నాడు. "ఇంక చాలు పిల్లలూ. చీకటి పడబోతోంది. ఇంటికాడ మీ అమ్మానాన్నలు ఎదురుచూస్తుంటారు. కావాల్నంటే ఇంకోసారి వొద్దురుగానీలే"అని చెప్పాడు నరసింహులు, సముదాయింపుగా.

"ఒక్క పది నిమిషాలే తాతా. ఆడుకుని యెళ్దాం" అన్నారు పిల్లలు. సరేననక తప్పలేదు నరసింహులుకి. పిల్లలు డిప్పాట ఆడుతుంటే చుట్ట వెలిగించి తోటలో తిరుగుతున్నాడు. ఒకచోట దొరువు కనిపిస్తే దానిలోకి దిగాడు. చల్లగా ఉన్నాయి నీళ్లు. చుట్ట ఆర్పి మొహం కడుక్కుంటున్నాడు. అతడు నిల్చున్నచోట పాచి పట్టి ఉంది. అతడు చూసుకోలేదు. సర్రున జారి దొరువులో పడిపోయాడు. రెండు అడుగుల లోతుకంటే ఎక్కువ లేవు నీళ్లు. అయినా నడుం పట్టేసినట్టయ్యింది. బట్టలన్నీ తడిసిపోయాయి. నొప్పి పెడుతుంటే నడుం పట్టుకుని వంగిపోయి, నెమ్మదిగా దొరువులోంచి బయటకు వొస్తున్నాడు. అప్పుడే డిప్పాటలో దొంగ పాత్ర పోషిస్తున్న ఏడేళ్ల పాప మిగతా వాళ్లని కనిపెట్టడంకోసం అటేపువొచ్చింది. దొరువులోంచి మెల్లమెల్లగా నల్లటి ఆకారం పైకి వొస్తుండటం చూసింది ఆ పాప. తల్లోంచి నీళ్లుకారుతూ, బవిరిగడ్డ మేసుకుని, ఒక కన్ను దాదాపు మూసుకుపోయి, వికృతంగా కనిపించిన ఆ ఆకారాన్ని చూసి దడుసుకుంది. దెయ్యమో, 'పాతాళ భైరవి'లోని నేపాళ మాంత్రికుడో వొచ్చాడనుకుంది. భయంతో నోరు తెరచి, అట్లానే వెనక్కి విరుచుకుపడిపోయింది పాప. నరసింహులు చూశాడు. ఆ అమ్మాయి ఎందుకలా పడిపోయిందో అర్థంకాలేదు. ఆందోళనగా పాప దగ్గరకెళ్లి "పాపా.. పాపా"అని కేకవేశాడు, కుదుపుతా. పాప ఉలకలేదు. పలకలేదు. దాంతో పాప గుండెమీద చెవి పెట్టాడు. బలహీనంగా కొట్టుకుంటోంది. 'అమ్మయ్య' అనుకుని తల పైకెత్తాడు. గుండె గుభేల్మంది. ఎప్పుడు వొచ్చారో మిగతా పిల్లలంతా ఎదురు నిల్చుని, భయంభయంగా అతడి వొంకా, కింద ఉన్న పాప వొంకా చూస్తున్నారు. పిడచకట్టుకు పొయ్యింది నరసింహులు నాలుక. సరిగ్గా అప్పుడే తోటమాలి వొచ్చాడు అక్కడకి.

> **"నిన్ను ఊరికే వొదిలిపెట్టకూడదురా పశువా. అన్నెంపున్నెం ఎరగని పసిదాని మీద అఘాయిత్యం చేస్తావా ముసలి నక్కా నీకు ఉచ్చంనీచం తెలీదా పశువా. నువ్వు బతక్కూడదు"**

"నేనేం చెయ్యలేదు. ఎందుకో పాప ఉన్నట్టుండి యెనక్కి యిరుచుకుని పడిపోయింది" అన్నాడు, నరసింహులు బలహీనమైన గొంతుతో.

⁂

ఆసామి ఇంట్లో ఆ రాత్రి వొకటే గొల్లున ఏడ్పులు.

"మేం చూసేసరికి పాపమీద పడుకుని ఉన్నాడు తాతయ్య" అన్చెప్పారు పిల్లలు, వాళ్లు చూసింది అదే కాబట్టి.

"నువ్వు మనిషివా, పశువ్వా. పసిపాపని పట్టుకుని..." అని శాపనార్థాలు పెట్టారు ఆడవాళ్లు. ఆసామి, అతని ఇద్దరు తమ్ముళ్లు పిడికిళ్లు బిగించి నరసింహుల్ని ఎక్కడపడితే అక్కడ గట్టిగా కొట్టారు. నరసింహులు మొహం పచ్చడైంది. నోరు, ముక్కూ కలిసిపోయినట్లయ్యాయి. నెత్తురు స్రవిస్తూ, నరసింహుల్ని ఇంటిముందున్న వేప చెట్టుకి కట్టేశారు.

"నిన్ను ఊరికే వొదిలిపెట్టకూడదురా పశువా. అన్నెంపున్నెం ఎరగని పసిదాని మీద అఘాయిత్యం చేస్తావా ముసలి నక్కా నీకు ఉచ్చంనీచం తెలీదా పశువా. నువ్వు బతక్కూడదు" అంటా కర్రలతో మళ్లీ చావబాదారు.

ఈమధ్యలో నరసింహులు నోరెత్తడానికి లేకపోయింది. తనేమిటి? పాప మీద అఘాయిత్యం చేయడమేమిటి? ఈ నిందతో అతని మెదడు మొద్దుబారిపోయింది. ఒళ్లంతా నెత్తురోడుతున్నా అతను అరవలేదు. ఏడవలేదు. విషయం తెలిసి పోలీసులొచ్చారు. నరసింహుల్ని పట్టుకుపోయారు. వొళ్లంతా పచ్చి పుండై పోలీస్టేషన్లో జీవచ్ఛవంలా పడి ఉన్నాడు. రెండురోజుల తర్వాత రాత్రివేళ "ఇక నువ్వెళ్లొచ్చు పెద్దాయనా"అన్నారు పోలీసులు అతన్ని విడిచిపెట్టేస్తా, నరసింహులుకి ఏమీ అర్థంకాలా. జైల్లోపెట్టకుండా తనని ఎందుకు వొదిలేస్తున్నట్లు? అదే అడిగాడు.

"ఆ పాప బతికింది. తనని నువ్వేమీ చెయ్యలేదని చెప్పిందిలే" చెప్పారు పోలీసులు.

అప్పుడు తెలిసింది నొప్పి. వొళ్లంతా భరించలేని నొప్పి. ఆ చీకట్లో పరుగుపరుగున ఇంటికొచ్చాడు నరసింహులు. యానాదమ్మ వొళ్లో తల పెట్టుకుని యెక్కిక్కి ఏడ్చాడు. అసలే ఆమె జబ్బు మనిషి. రెండు రోజుల్నించీ ఆమెకి తిండి లేదు. మొగుడి మీద బెంగతో. నరసింహులు ఎలాంటివాడో ఆమెకి తెలుసుకదా! ఈ వయసులో అతని మీద పడ్డ అపవాదు, పోలీసులు తీసుకుపొయ్యారన్న బాధ ఆమెని కుంగదీశాయి. నరసింహులుతోపాటు ఆమె కూడా ఏడ్చింది.

తెల్లారింది. రాత్రికి రాత్రే నరసింహులు ఇల్లు ఖాళీ చేసి ఎక్కడికో వెళ్లిపోయాడని అంతా అనుకున్నారు. అక్కడ మాయమైన మనిషి పందిళ్లపల్లిలో తేలాడు. అదీ ఊరికి దూరంగా, ఇరవై ఏళ్లయ్యింది ఇక్కడికొచ్చి. ఇప్పుడు నరసింహులుకి డెబ్బై రెండేళ్లు. అయినా తొంభై ఏళ్ల వాడిలా కనిపిస్తున్నాడు. ఆర్మీనుంచి పెన్షను రావడం పర్చూరు నుంచి వొచ్చేశాక ఆగిపోయింది.

ఇరవై ఏళ్ల క్రితం జీవితంలో ఎదురైన భయానక అనుభవం అతణ్ణి మానసికంగా, శారీరకంగా కుంగదీసింది. దాంతో డ్రైవరుగానే కాదు వాచ్‌మన్‌గానూ పని కిరాకుండా పోయాడు. కూతుళ్లతో సంబంధాలూ తెగిపోయాయి. తననితనే పోషించుకోలేని దీన స్థితి. మళ్లీ తన మెడకో డోలు లాంటి యానాదమ్మ, నరసింహులు బిక్షగాడిగా మారిపోయాడు. అప్పట్నించీ ఇప్పటిదాకా పందిళ్లపల్లి వీధుల్లో 'అమ్మా కాస్త అన్నం పెట్టు తల్లీ', 'బాబూ ఒక్క పావలా ఉంటే ధర్మం చెయ్యి బాబూ' అన్న నరసింహులు గొంతు ప్రతిధ్వనిస్తూనే ఉంది.

⁂

"అరే పెద్దాయనా చస్తావ్. కాస్త చుట్టుపక్కల చూస్కో"అని చేయి పట్టుకు లాగాడు రాజేంద్ర. దాదాపు నరసింహుల్ని రాసుకుంటున్నట్లుగా పోయింది ఓ లారీ.

"నువ్వా బాబూ, ఇందాక కనపడకపోయేసరికి ఊళ్లో లేవేమోననుకున్నా"అన్నాడు నరసింహులు. కాస్త ఊరట చెందిన మనసుతో.

ఎందుకనో తెలీదు నరసింహులంటే రాజేంద్రకి జాలి. కనిపించినప్పుడల్లా ఐదు లేదంటే పది రూపాయల నోటు ఇస్తుంటాడు. ఇప్పుడూ ఇచ్చాడు పది రూపాయలు.

"పిల్లాపాపలతో సల్లంగ ఉండు కొడుకా" అన్నాడు నరసింహులు అక్కడే తలుపులు వేసున్న ఓ ఇంటి అరుగుమీద కూలబడతా.

రాజేంద్ర నవ్వి, "చీకటి పడింది. ఇంటికెళ్లు. ముసలామె నీకోసం ఎదురు చూస్తుంటుంది"అంటా వెళ్లిపోయాడు.

"అవునవును. వొచ్చేప్పుడు ముసల్ది బిళ్లలు తెమ్మంది"అని తనలో తనే గొణుక్కుంటున్నట్లు అంటా మెడికల్ షాపుకేసి నడిచాడు మిల్ట్రీ నరసింహులు. ★


**రచయిత చిరునామా:**

**బుద్ధి యజ్ఞమూర్తి,**
ఎంఐజి-257, పెంట్ హౌస్,
బాలాజీనగర్, కూకట్‌పల్లి,
హైదరాబాద్- 500 072.